క్షయ నిర్మూలనకు చికిత్సే మార్గం

- ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు
- వ్యాధి నిర్మూలనకు సిబ్బంది ప్రతిజ్ఞ



రాజంపేట రూరల్: ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే


రైల్వేకోడూరు అర్బన్: టోల్‌గేట్ వద్ద మానవహారంగా నిలుచున్న వైద్య సిబ్బంది

రైల్వేకోడూరు అర్బన్ : క్షయవ్యాధి నిర్మూలించాలంటే వ్యాధి లక్షణాలను మొదట్లోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నిర్మూలించవచ్చని సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ బ్రహ్మకుమారి తెలిపారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్ష, పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కలిగి ఉంటారని తెలిపారు. అలాంటి వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వెంటనే పరీక్షలు చేయించుకొని వైద్యం, మందులు పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గురుమహేష్, మస్తాన్, సాయి, సిబ్బంది ఓబులేసు, బాలకృష్ణంరాజు, మహేష్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, ఆసియా, మల్లికార్జున పాల్గొన్నారు.

జాగ్రత్త వహించాలి

సుండుపల్లె : ప్రజలందరూ క్షయ వ్యాధి పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ ఫర్హానా ఖానం తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి అని, వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. క్షయ లక్షణలు ఉంటే పరీక్ష చేయించుకోవాలన్నారు. జబ్బు నిర్ధారణ అయితే ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందిస్తామన్నారు. ప్రజలంరదూ క్షయ వ్యాధి రహిత భారత్‌కు సహకరించి వ్యాధి నిర్మూలనకు స్పష్టి పలుకుదామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా ఆదరించాలని డాక్టర్ నజియ మహరాజ్, క్షయవ్యాధి సూపర్‌వైజర్ హరిలు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ దేవదానం, ఎంపీహెచ్‌ఎస్ సురేంద్ర రెడ్డి, సూపర్ వైజర్ మణి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

రాజంపేట రూరల్ : క్షయ వ్యాధి నిర్మూలనకు నిరంతరం కృషి చేయాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే వైద్యులను కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్, టీబీ మెడికల్ అధికారి డాక్టర్ శరత్, సూపర్ వైజర్ పిల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగరాజు బాలరాజు సౌజన్యంతో 10 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని ఏఎస్పీ చేతులమీదుగా అందజేశారు. అదే విధంగా ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ అశోక్ చైతన్యతో పాటు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీని ఏఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఏరియా ఆసుపత్రి నుంచి మార్కెట్ వరకు సాగింది. అనంతరం మనోజ్ రామనాథ్ హెగ్డే మాట్లాడుతూ టీబీ వంటి వ్యాధులను అరికట్టడంలో వైద్యులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్.బాలరాజు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ నాగేశ్వరరాజు, వైద్యులు అనిల్ కుమార్, లక్ష్మీప్రసన్న, సౌజన్య, సుధాకర్, సునీల్, సుబ్బారెడ్డి, శ్రీహరీ, మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్, శశాంక్, చలమయ్య, ఆకేపాడు పీహెచ్‌సీ సూపర్ వైజర్ రవిశంకర్‌రాజు, ఎంపీహెచ్ ఐఓ శంకరరాజు, యూడీసీ యు.సిద్ధిరామయ్య, సబ్ యూనిట్ అధికారి స్వామిదాస్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, ప్రియాంక నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజంపేట డివిజనల్ టీబీ యూనియ్ మెడికల్ ఆఫీసర్ శరత్ కమల్ పిలుపునిచ్చారు. మండలంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ నాగేశ్వరి అధ్యక్షతన ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. క్షయవ్యాధి నివారణపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కెఎస్ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, పాఠశాల స్టాఫ్ నర్సు కోటేశ్వరమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : క్షయవ్యాధికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో చికిత్స చేయడం జరుగుతుందని, ప్రజలు గుర్తించాలని డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ముక్కావారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా టీబీ వ్యాధులపట్ల ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటసుబ్బయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

పుల్లంపేట : చేయిచేయి కలిపి టీబీ వ్యాధిని తరిమికొడదామని డాక్టర్ మనోజ్ చంద్ర అన్నారు. సోమవారం సీహెచ్‌ఓ ఆధ్వర్యంలో జాతీయ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సుండుపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది


లక్కిరెడ్డిపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ఓబులవారిపల్లె: ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది


నందలూరు: బహుమతులు అందజేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ

గాలివీడు : సరస్ (సేవ్ ఆల్ రీచ్ ఆల్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్, టైలరింగ్‌లలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవ తరగతి పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు 108 కార్యాలయం నీళ్ల ట్యాంక్ పక్కన ఉన్న కార్యాలయంలో అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. శిక్షణ 90 రోజుల పాటు ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 75691 71405లో సంప్రదించాలన్నారు.

27న ఫ్యాప్టో జిల్లా కమిటీ ఎన్నిక

రాయచోటి అర్బన్ : ఈనెల 27న జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఫ్యాప్టో జిల్లా నూతన కమిటీ ఎంపిక కార్యక్రమం జరుగుందని జిల్లా ఫ్యాప్టో చైర్మన్, సెక్రటరీలు అంకం శివారెడ్డి, రవిశంకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4:30 గంటలకు పట్టణంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. నూతన కమిటీకి ఎన్నిక నిర్వహణ అధికారిగా రూటా రాష్ట్రనేత ఇక్బాల్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లా ఫ్యాప్టో సంఘం సభ్యులు, నేతలు హాజరై నూతన కమిటీ ఎంపికలో పాల్గొంచుకోవాలంటూ కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అర్హులైన బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. అనాథ బాలికలు, బడి బయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద బాలికలు ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 96765 88775ను సంప్రదించాలన్నారు.

కారు బోల్తా; ఇద్దరికి స్వల్ప గాయాలు


మంగంపేట వద్ద బోల్తాపడ్డ కారు

ఓబులవారిపల్లె : కడప – రేణిగుంట జాతీయ రహదారి మంగంపేట వద్ద సోమవారం తెల్లవారుజామున కారు బోల్తా కొట్టింది. తెలంగాణకు చెందిన ఇద్దరు ప్రయాణికులు తిరుమలకు వెళ్తుండగా మార్గ మధ్యలోని మంగంపేట జాతీయ రహదారి వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. కారులోని వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తెల్లవారుజామున పెద్దగా వాహన రాకపోకలు లేక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. గాయపడిన వారిని అంబులెన్సు ద్వారా ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

కూలీ డబ్బులు చెల్లించండి

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న జాతీయ ఉపాధి గ్రామీణ హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత మూడు నెలలుగా డబ్బులు రాక ఇబ్బందులు పడతున్నట్లు పలు గ్రామాల ఉపాధి కూలీలు తెలిపారు. పనుల కోసం ఇళ్లను విడిచి వెళ్లలేక ఉపాధి హామీ పనులకు వెళుతుంటే ఇక్కడ పని చేసిన కూలి డబ్బులు రాకపోతుండటంపై ఆవేదనను వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిలను సంబంధిత అధికారులు త్వరగా ఖాతాలో జమ చేయాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు


డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

గాలివీడు : వాహనాల తనిఖీ సమయంలో ఆటో డ్రైవర్లకు సంబంధించిన విషయాలను సులువుగా తెలుసుకునేందుకు వీలుగా గుర్తింపు కార్డులను పంపిణీ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల పంపిణీలో భాగంగా ఆయన కొన్ని సూచనలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ముందు సీట్‌లో ప్రయాణికులను కూర్చోబెట్టుకుంటే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని అటవీశాఖ విడిది గృహంలో రేపు బుధవారం ఏపీఎస్పీడీసీఎల్, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, ఆపరేషన్ కడప డివిజన్ వారి ఆధ్వర్యంలో ఉదయం 11:30 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఒంటిమిట్ట విద్యుత్‌శాఖ ఏఈ ఉదయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ వి.శ్రీనివాస్, ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు కె.రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యురాలు డబ్ల్యూ విజయలక్ష్మిలు హాజరవుతారని చెప్పారు.

పేద ముస్లింలకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్‌బాషా

రాజంపేట టౌన్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని సోమవారం రాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పేద ముస్లింలకు మండల కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. మహిళలకు చీరె, పురుషులకు పంచెను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌస్‌బాషా మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ ముఖ్యమైన పండుగ అని, పండుగకు ప్రతి ముస్లిం కొత్త దుస్తులు ధరించాలనే ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అల్లాహ్ కృపవల్లే పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు దుస్తులు పంపిణీ చేసే భాగ్యం తనకు కలిగిందన్నారు. ముస్లింలందరూ రంజాన్‌ను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ముజఫర్ అహమ్మద్, పి.మోసిన్‌ఖాన్, జి.ఇనాయతుల్లా, కరీం, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


పొంగుబాళ్లు పొంగిస్తున్న మహిళలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో సోమవారం లేబాకు రవి ఆచారి, సునీతల ఆధ్వర్యంలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. అలాగే స్థానికంగా ఉండే గ్రామస్తులు గంగమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మవారికి పొంగుబాళ్ల సమర్పించారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అధికారులకు సూచించారు. సోమవారం ఎంపీపీ కార్యాలయంలో అధ్యక్షులు టంగుటూరు చంద్ర అధ్యక్షతన ఎంపీడీఓ మోహన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ఒకవేళ అలాంటి సమస్యలు వస్తే ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. అనంతరం అధికారులు ఆయా శాఖల్లో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్ కృష్ణ, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం రెడ్డి, రామాంజుల నాయుడు, రవికుమార్ రాజు, చంద్రమోహన్, నరసింహ, గుండయ్య, నాగార్జున, పెంచల్ రెడ్డి, రాజశేఖర్ యాదవ్, నాగరాజు, కో–ఆప్షన్ సభ్యులు అన్సర్ బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎస్‌ఐ రఘురాం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా


టక్కోలు - బండికనుమ దారిలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల నిఘా

సిద్దవటం : మండలం నుంచి అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో నిఘా ఉంచామన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలు, డేగనవాండ్లపల్లి, మాచుపల్లె, మూలపల్లె గ్రామాల పెన్నా నది నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు. ఆ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేసి ఇసుక తరలిపోకుండా కట్టడి చేశామన్నారు. బండికనుమ వద్ద ఇసుక ట్రాక్టర్‌లు వస్తే అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేపడతామన్నారు. గృహ నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక విధానాన్ని ఆయా గ్రామాలలో వినియోగించుకోవాలని, ఉచిత విధానం ముసుగులో ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయండి


ఆర్‌ఓ ప్లాంట్ గురించి ఈడీతో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి

పుల్లంపేట : మండలంలోని పుల్లంపేట హరిజనవాడ, జాగువారిపల్లి హెచ్‌డీసీ కాలనీలను అన్నమయ్య జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు సోమవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజా సమస్యలు, మౌలిక వసతులను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, సిబ్బంది పరిశీలించారు. అధికారులను కలుసుకున్న పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను అధికారులకు తెలియజేశారు. అలానే 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఓ ప్లాంట్‌లను పంచాయతీలోని హెచ్‌డీసీ కాలనీ, పుల్లంపేట హరిజనవాడల్లో ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలో ఆర్‌ఓ ప్లాంట్లను మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, సిబ్బంది అనిల్ కుమార్ రెడ్డి, ఆనంద్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో బండపై వెలసిన శివాలయంలో సోమవారం మండల పూజ శివపార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయగా అనంతరం శివపార్వతుల కల్యాణం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి పార్వతి, గణపతి, ధ్వజస్తంభము, మూల విగ్రహాలతో పాటు ఉత్సవమూర్తులు, శివపార్వతులు, మకర తోరణం కడపకు చెందిన ప్రముఖులు రాధాకృష్ణ, విజయలక్ష్మి, మన్నేరు జనార్ధన, భానులత, శ్రీనివాసులు, లక్ష్మికళ, సన్నిలు వితరణ చేశారు. కళ్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పది పరీక్షకు ఇద్దరు గైర్హాజరు

సిద్దవటం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం జరిగిన 10వ తరగతి గణితం పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల కేంద్రంలో రెండు సెంటర్లు ఉండగా ఎ–సెంటర్‌లో 135 మంది విద్యార్థులు గాను 134 మంది హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ అంబేద్కర్ తెలిపారు. డిపార్ట్‌మెంటల్ చీఫ్‌గా నరసింహులు వ్యవహరిస్తున్నారు. అలాగే బి–సెంటర్‌లో మొత్తం విద్యార్థులు 150 మందికి గాను 149 మంది హాజరైయ్యారని, ఒకరు గైర్హజరైయ్యారని చీఫ్ ఎగ్జామినర్ జమాల్ రెడ్డి తెలిపారు. డిపార్ట్‌మెంటల్ చీఫ్‌గా రామకేశవ వ్యవహరిస్తున్నారు. ఒంటిమిట్ట సీఐ టి.బాబు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

రామాపురం : మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కింద నమోదైన విద్యార్థులకు యూనిఫాంను ప్రిన్సిపల్ శ్యామలాదేవి సోమవారం పంపిణీ చేశారు. మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలను పెంపొందించడం కోసం స్కౌట్స్ అండ్ గైడ్ యూనిట్లను పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఎంశ్రీ నిధులు రూ.30వేలు ద్వారా స్కౌట్స్ అండ్ గైడ్ దుస్తులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు ప్రేమ్‌సాగర్, పెద్దయ్య, గైడ్ కెప్టెన్లు శివలీల, చంద్రసేన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉచితంగా సేంద్రియ ఎరువు పంపిణీ'


వానపాములను వదులుతున్న సర్పంచ్ సుజాత, కార్యదర్శి సుధాకర్‌లు

ఒంటిమిట్ట : సేంద్రియ ఎరువుల తయారీ కోసం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సోమవారం సర్పంచ్ కత్తి సుజాత, కార్యదర్శి సుధాకర్‌ల ఆధ్వర్యంలో వానపాములను వదలడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్త నుండి సంపద కేంద్రంలో సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు నెల రోజులుగా టెంకాయ చిప్పలు వేసి దానిపై పేడ వేసి, ఆకుపట్టుతో పైభాగాన పేర్చి నీళ్లు పడుతుండటంతో బాగా చల్లబడిన తరువాత పిచికారీలో వానపాములను సోమవారం వదలడం జరిగింది. ఇవి వదిలిన 40 రోజులు తరువాత సేంద్రియ ఎరువును గ్రామ పంచాయతీకి చెత్త ఇచ్చు ప్రజలకు వారి పరిసరాల్లో మొక్కలు పెంచుకునే వారికి కేజీ చొప్పున ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

అనుబంధ పత్రాలు అందజేయండి


వీఆర్‌ఓలతో తహసీల్దార్ అమరేశ్వరి ప్రత్యేక సమావేశం

పెనగలూరు : మండలంలో పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకున్న వారికి అనుబంధ పత్రాలు ఇచ్చేందుకు వీఆర్‌ఓలు సంసిద్ధంగా ఉండాలని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కా గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి, సొంత స్థలాలు కల్గి ఉన్న వారికి మాత్రమే అనుబంధ పత్రాలు ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హరిప్రసాద్, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు లీడరుపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : డ్వాక్రా గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.12 లక్షల రుణాన్ని పొందడమే కాక ఆ సొమ్మును డ్రా చేసుకున్న గ్రూపు లీడర్ షేక్ మౌలాబీపై చర్యలు తీసుకోవాలంటూ గ్రూపు సభ్యులు కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కోరారు. డ్వాక్రా గ్రూపు లీడర్ మౌలాబీపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో రాయచోటి రూరల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన మూల గంగమ్మ తల్లి డ్వాక్రా సంఘం సభ్యులు సోమవారం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీనేత ఎం.విశ్వనాథ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రూపు లీడర్ మౌలాబీ సభ్యులకు తెలియకుండా తప్పుడు సంతకాలతో కడప డీసీసీ బ్యాంకులో రూ.12 లక్షల రుణం తీసుకుందని, తరువాత బ్యాంకు అధికారులు తీసుకున్న రుణం చెల్లించాలంటూ గ్రూపు సభ్యులపై ఒత్తిడి తేవడంతో రహస్యం బయటపడిందన్నారు. ఇప్పుడు గ్రూప్ లీడర్ గల్ఫ్ దేశాలకు వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తోందని అధికారులు స్పందించి ఆమెపై కఠినచర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో గ్రూపుసభ్యులు గంగాదేవి, రెడ్డిశివమ్మ, తులసమ్మ, శివప్ప, లిబరేషన్ పార్టీ నేతలు రమణ, సుజాతతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి

రాజంపేట : పీజీఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి అన్నారు. సబ్ కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకు లోనై వచ్చిన వారిపట్ల ఆప్యాయత చూపి వారి నుంచి సమస్యను సానుకూలంగా వినాలన్నారు. వినతిని పరిశీలించి, నిబంధనల మేరకు సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. కార్యాలయాల చుట్టూ బాధితులను తిప్పుకోరాదని తెలియజేశారు. అటువంటి సందర్భాలపై అధికారులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పీజీఆర్‌ఎస్‌లో రాజంపేట సబ్‌కలెక్టరేట్ పరిపాలనాధికారి శేషయ్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : తిరుపతిలో జరిగే చేయాలని 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కల వెంకటేష్, దార్ల రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోలు మణి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగరంలో మొదటి మొదటిసారి 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.